సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 27 । జూలై । 2024



బంగారు భవితకు..

జవహర్ నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రక్రియ ప్రారంభమైంది. - 8లో



జీడి పరిశ్రమలో తనిఖీలు

పలాస జీడి పరిశ్రమలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేశారు. తనపై కక్ష కట్టారని నిర్వాహకుడు ఆరోపించారు. - 8లో

ఆగస్టు 11న జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆగస్ట్ 11వ తేదీన జరగనున్నాయని జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.భాస్కరరావు, కార్య దర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. అప్పన్నమ్మ తల్లి దేవాలయం సమీపంలో జరిగే ఈ పోటీలకు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలతో హాజరుకావాలని వారు కోరారు. వివరాలకు 6281641639 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ బాలల పురస్కారాలకు గడువు పొడిగింపు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల గడువు ఆగస్టు 31 వరకు పొడిగించినట్లు ఏపీఎస్సీపీసీఆర్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 26న జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను జూలై 31లోగా పంపించాలని మొదట గడువు విధించారని, ఇప్పుడు ఆ గడువును ఆగస్టు 31 వరకు పొడిగించారని తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనపరుస్తున్న భారతదేశ సంతతికి చెందిన 5–18 ఏళ్ల బాలలు హెచ్‌టీటీపీ/అవార్డ్.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నూతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రతి వారం డివిజన్, మండలం స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉదయం పది గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టెక్కలిలో ఇసుక స్టాక్ క్లియర్

టెక్కలి: టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక అమ్మకాలు శుక్రవారంతో పూర్తయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి మైన్స్ అధికారుల పర్యవేక్షణలో అమ్మకాలు ప్రారంభించారు. టన్ను ఇసుక రూ.340ల చొప్పున ట్రాక్టర్ ఇసుకను రూ.1700లకు విక్రయించారు. ఇసుక కోసం ప్రతి రోజూ పాత జాతీయ రహదారిలో వందలాది ట్రాక్టర్లు క్యూ కట్టిన సంగతి తెలిసిందే. ఒక లోడ్ ఇసుక కోసం రెండు రోజులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. దీనికి తోడు రాత్రిళ్లు పార్కింగ్ చేసిన ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు, ఇతర సామగ్రి చోరీకు గురయ్యాయి. మార్కెట్‌లో ట్రాక్టర్ ఇసుక రూ.4500 మేరకు విక్రయించారు. ఇక్కడ 11వేల టన్నుల ఇసుక విక్రయించారు.

లోహరిబంద కార్యదర్శిపై విచారణ పూర్తి

అరసవల్లి: పలువురికి ఉద్యోగాలిప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లుగా మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబుపై వచ్చిన ఫిర్యాదులు, అభియోగాలపై శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విచారణ పూర్తయ్యింది. ఈ మేరకు ఇటీవల పలువురు బాధితులు కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేసిన క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈఓ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి మోసపోయిన ఆరుగురు బాధితులు రామానందం, రాజాబాబు, నరేష్‌కుమార్, గౌరిశంకర్, సాయికృష్ణ, ప్రవీణ్‌కుమార్‌లతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న సతీష్‌బాబును జెడ్పీకి పిలిపించారు. జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈఓ వెంకట్రామన్‌లు సంయుక్తంగా విచారించారు. బాధితులు, ఇటు సతీష్‌బాబుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అనంతరం జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధితులతో మాట్లాడామని, అంతా పంచాయతీ కార్యదర్శి సతీష్‌బాబు మోసం చేశాడని చెప్పారని, అలాగే పోలీసు కేసు నమోదు ఇతరత్రా వివరాలపై లిఖితపూర్వకంగా తీసుకున్నామని, నివేదికను కలెక్టర్‌కు నివేదించనున్నామని ప్రకటించారు.



ఈ ఫోటో చూశారా? రైతు భరోసా కేంద్రంలో దించాల్సిన ఎరువులను టీడీపీ నాయకుడు అధికార దర్పంతో తన ఇంటి వద్ద దించుకున్న దృశ్యమిది. ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు తన ఇంటి వద్ద ఎరువును దింపించుకున్నాడు. రైతు భరోసా కేంద్రాన్ని కాదని తన ఇంటి వద్దనే తనకు కావాల్సిన వారికి ఎరువులు అందజేశారు. దీనిపై స్థానికులు బొడ్డేపల్లి నారాయణరావు, బొడ్డేపల్లి నిరంజన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.



ఈ చిత్రం చూశారా? టీడీపీ నాయకుడు అడిగినంత ఎరువులు ఇవ్వలేదని ఏకంగా సచివాలయం భవనంలో ఎరువులను నిల్వ చేసిన గదికి తాళం వేసిన దృశ్యమిది. ఆమదాలవలస మండలం చింతలపేట సచివాలయం భవనంలో ఎరువులను నిల్వ ఉంచిన గదికి ఆ గ్రామ టీడీపీ కార్యకర్తలు నేతింటి జ్యోతీశ్వరరావు, కంచు దాలినాయుడు తమ సొంత తాళాలు వేశారు. ఆ గ్రామానికి వచ్చిన 440 యూరియా బ్యాగుల్లో 200 బ్యాగులకు తమకే ఇవ్వాలని పట్టుబడితే.. వ్యవసాయాధికారి స్పందించి వేరే ఆర్‌బీకే నుంచి 100 బ్యాగులు ఇస్తానని సర్ది చెబితే గానీ వారు ఆ తాళం తీయలేదు.

అయిన వారికే ఎరువు.. కాని వారికి కరువు

- ప్రభుత్వ ఎరువులు తమ ఆధీనంలో ఉండేలా టీడీపీ నాయకుల దౌర్జన్యం
- టీడీపీ సానుభూతి పరులకే అందేలా అధికారులపై ఒత్తిళ్లు
- మాట వినని చోట ఎరువుల గదులకు తాళాలు వేస్తున్న పరిస్థితి
- తమ ఇళ్లల్లో, ప్రైవేటు గోడౌన్‌లలో ఎరువులను దించుకుంటున్న దుస్థితి
- ఎరువుల కోసం రైతులకు తప్పని మునుపటి అవస్థలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

రైతులకు మునుపటి కాలం గుర్తుకు వస్తోంది. ఐదేళ్ల కిందటి వరకు విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా రోజుల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వచ్చేది. అప్పటి టీడీపీ నాయకుల దయాదాక్షిణ్యాల మీదే ఎరువు అందేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు వచ్చాక ఆ పరిస్థితులు సమూలంగా మారాయి. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న విస్తీర్ణం మేరకు రైతుకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేసేవారు. ఎవరినీ అడగాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ ఇప్పుడు అధికారం టీడీపీ చేతుల్లోకి వెళ్లాక.. ఎరువులు నేరుగా రైతు చేతుల్లోకి రావడం ఆగింది. అధికారం చేతిలో ఉండటంతో వాళ్లు చెప్పిందే జరగాలని టీడీపీ నేతలు అధికారులను సతాయిస్తున్నారు. అధికారులు సైతం వంత పాడుతూ టీడీపీ నాయకులు చెప్పినట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో మళ్లీ పాత రోజులు వచ్చేశాయని రైతులంటున్నారు.



ఈ-క్రాప్‌కు ఎసరు



జిల్లాలో 4లక్షల 40వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగవుతున్నాయి. వీటిలో వరికి ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో నిర్దేశిత సమయానికి యూరియా, డీఏపీ అవసరం ఉంటుంది. వీటి కోసం 2014–19లో రైతులు లైన్లలో రోజుల తరబడి నిరీక్షించేవారు. అక్కడ దొరక్కపోతే బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించేవారు. ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకే గతిలేక కొనేవారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆ సమస్యలుండేవి కావు. రైతు ఎంత సాగు చేస్తున్నారో? వారికెంత ఎరువులు అవసరమో ? ఈ-క్రాప్ ద్వారా ముందే గుర్తించేవారు. ఆ మేరకు రైతులకు సరిపడా ఎరువులు నేరుగా ఇంటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ-క్రాప్ కార్యక్రమాన్ని పక్కన పెట్టేశారు. జిల్లాలో ఏ రైతులు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో వంటి వివరాలు అధికారుల వద్ద అందుబాటులో లేవు. దీంతో టీడీపీ నాయకుల జోక్యం పెరిగి రైతులకు మునుపటి అవస్థలు తప్పడం లేదు.

రైతుపై అదనపు భారం

జిల్లాలో సాగవుతున్న విస్తీర్ణానికి 61వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంది. వీటిలో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు ఉంటాయి. వీటిలో 50 శాతం ప్రభుత్వ ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలి. మిగతా 50శాతం ప్రైవేటు డీలర్లు విక్రయించాల్సి ఉంటుంది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు సరఫరా చేసే ఎరువులను కంపెనీవారు ఎఫ్‌ఓఎల్(ట్రాన్స్‌పోర్ట్ ఫ్రీ) పద్ధతిలో ఇస్తారు. దీని వల్ల రైతుకు 45బస్తాల యూరియా రూ. 267కు వస్తుంది. డీఏపీ రూ.1350కి వస్తుంది. ఇవే కంపెనీలు ప్రైవేట్ డీలర్ల వద్దయితే యూరియా రూ. 310నుంచి రూ.320వరకు ఉంటుంది. వీటితో పాటు లింక్ ప్రొడక్ట్స్‌గా సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్స్, బయోగ్రాన్యుల్స్, నానో ఉత్పత్తులు, జింక్, మెగ్నీషియం సల్ఫేట్, బోరాన్ తదితర మైక్రోన్యూట్రియంట్స్ అంటగడతారు. ఇవి తీసుకుంటేనే యూరియా, డీఏపీ ఇస్తామని షరతులు పెట్టడంతో రైతులు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

చెలరేగిపోతున్న టీడీపీ నాయకులు

అధికారం దక్కాక టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం ద్వారా అందించే ఎరువులపై పెత్తనం చెలాయిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద దించాల్సిన ఎరువులను తమ ఇళ్ల వద్ద దించుకుంటున్నారు. కొన్నిచోట్ల తమ కనుసన్నల్లో నడిచే పీఏసీఎస్‌ల వద్ద దించుతున్నారు. ఇంకొందరు తమ ప్రైవేటు గోడౌన్‌లలో దించుతున్నారు. అధికారులు సైతం తలొగ్గడంతో తమ ఆధీనంలో దించుకున్న ఎరువులను తమకు కావాల్సిన వారికే విక్రయిస్తున్నారు. ఫలితంగా టీడీపీ సానుభూతి పరులకు ప్రభుత్వం సరఫరా చేసే ఎరువులు అందుతున్నాయి. మిగతా వారు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించి అధిక ధరలకు కొనక తప్పడం లేదు. పీఏసీఎస్‌లు పేరుకే ప్రభుత్వ సంస్థలు అయినప్పటికీ అధికార పార్టీ నాయకుల పెత్తనం ఉండటంతో అక్కడ వారి మాటే చెల్లుబాటవుతోంది. రైతు భరోసా కేంద్రాల్లో కూడా ఇదే పరిస్థితి కనబడుతోంది. ప్రస్తుతం యూరియా, డీఏపీకి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అధికార పార్టీ నాయకులకు పంట పండినట్టు అయింది. కొందరు తమ అనుయాయులకు అందజేస్తుండగా, మరికొందరు కమిషన్లు తీసుకుని విక్రయిస్తున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది.

సిఫారసులు అందాకే..

పోస్టింగులు

- తహసీల్దార్లకు మంగళవారం నాటికి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం
- ఎమ్మెల్యే సిఫారసుల కోసం ఎదురుచూపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధులకు వెళ్లిన తహసీల్దార్లు జిల్లాకు వచ్చేశారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు కూడా జిల్లా నుంచి రిలీవ్ అయ్యారు. అయితే జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ జాప్యమయ్యేలా కనిపిస్తోంది. జిల్లాకు చెందిన మంత్రి, శాసన సభ్యులు తమ సిఫారసులు లేనిదే ఎవరికీ నియామక ఉత్తర్వులు ఇవ్వకూడదని ఉన్నతాధికారులకు తేల్చి చెప్పేశారు. దీంతో ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వలేకపోతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ప్రస్తుతానికి జిల్లాలో లేకపోవడంతో వారు వచ్చి సిఫార్సు లేఖలు ఇచ్చాక పోస్టింగ్‌లు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాకు సంబంధించి 45 మంది తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మరికొందరు తమ బంధువుల ద్వారా రాయ'బేరాలు' నడుపుతున్నారు. ప్రస్తుతానికైతే హిరమండలం, పాతపట్నం మండలాలకు తహసీల్దార్లను నియమించాలని అక్కడి ఎమ్మెల్యే కలెక్టరేట్‌కు సిఫారసు లేఖను అందజేశారు. మిగిలిన మండలాలకు సంబంధించి సిఫారసులు వచ్చేంత వరకు జిల్లాలో 30 మండలాలకు, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయం, పొరుగు సేవల పోస్టులకు నియామకాలు చేపట్టేలా కనిపించడం లేదు.

రాజమోహన్‌కి పోస్టింగ్

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా పనిచేసి, ఎన్నికల విధులకు అనకాపల్లి వెళ్లి వచ్చిన రాజమోహన్‌కి కలెక్టరేట్‌లోని జి సెక్షన్‌లో పోస్టింగ్‌ను ఇచ్చారు. ఆయన ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన రిటైర్‌మెంట్‌కు ఇబ్బంది లేకుండా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఒకటో తేదీ నుంచి జి సెక్షన్‌కి కొత్త తహసీల్దారును నియమించే అవకాశం ఉంది.

మొదటి రోజు 461 మందికి ప్రవేశాలు

- ప్రారంభమైన ఆర్‌జీయూకేటీ ప్రవేశాల కౌన్సెలింగ్



హాజరైన విద్యార్థులు



విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎం పురం క్యాంపస్ ప్రవేశాల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 11వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటించారు. కౌన్సెలింగ్‌లో భాగంగా మెరిట్ లిస్ట్ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు శుక్రవారం 515 మందిని పిలవగా 461 మంది హాజరయ్యారు. 54 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో 296 బీసీ, 56 ఎస్సీ, 78 ఈడబ్ల్యూఎస్, 22 ఎస్టీ, 9 మంది ఓసీ విద్యార్థులు ఉన్నారు. శనివారం 521 మంది విద్యార్థులను పిలిచారు. మొదటి రోజు హాజరు కానివారు సైతం హాజరై సీట్లు పొందవచ్చు. రెండు రోజులు కౌన్సెలింగ్ పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ ఆప్షన్ మళ్లీ ఇచ్చి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

మొదటి రోజు కౌన్సెలింగ్ సజావుగా పూర్తయ్యింది. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పత్రాలు పరిశీలించి సీట్లు కేటాయించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ అమరేంద్రకుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, ఏఓ మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి, అడ్మిషన్ల కన్వీనర్ గోవర్ధనరావుతో కూడిన అధికారు లు కౌన్సెలింగ్ పర్యవేక్షించారు. మిగులు సీట్లకు ఆగస్టు మొదటి వారంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు అధికారులు చెప్పారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు ఆప్షన్లు ఇచ్చుకున్న మెరిట్ విద్యార్థులు ఎస్.విద్యశ్రీ, ఎల్.భావన, ఎస్.మానస, జి.షణ్ముకేశ్వర్, డి.రాకేష్‌లకు అడ్మిషన్ ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేశారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి: ఎస్పీ



పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసు వృత్తిలో క్రమశిక్షణతో విధులు నిర్వర్తించటం కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ప్రత్యేక పరేడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులు ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు శేషాద్రి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'లింగ వివక్ష రూపుమాపుదాం'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ వివక్ష రూపుమాపే చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బేటీ బచావో–బేటీ పడావోపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాలన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో పాలిచ్చే తల్లులకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆడ పిల్లల జననాలు తక్కువగా ఉన్న ఆస్పత్రులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బాలికలకు ఉన్నత విద్యకు ఎలాంటి పూచీ లేకుండా రూ.7 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ బేటీ బచావో - బేటి పడావోపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, డీఆర్‌డీఏ కిరణ్ కుమార్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఐఓ దుర్గారావు, డీఈఓ వెంకటేశ్వరరావు, ఏసీపీ జయ ప్రకాష్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

• జై జవాన్



కార్గిల్ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తూ జేబీటీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం జై జవాన్ ఆకారంలో కూర్చున్నారు. కార్గిల్ యుద్ధం జరిగిన 25 ఏళ్ల గడుస్తున్న సందర్భంగా అమరులకు నివాళులర్పించారు. - సారవకోట

• పొలంబడిలో..

శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సాగుపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు వరినాట్లు వేశారు. - ఇచ్ఛాపురం రూరల్



క్లుప్తంగా

చెట్ల పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న యువకులు

శ్రీకాకుళం కల్చరల్: ఇద్దరు యాత్రికులు చెట్ల పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర చేస్తున్నారు. వారిలో ఒకరైన అఖిల్ కేరళ రాష్ట్రం నుంచి నేపాల్ వెళుతుండగా, మరొకరైన రమేష్ మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జ్యోతిర్లింగాలు దర్శించేందుకు వెళుతున్నారు. వీరిద్దరూ శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకోగా జనసేన పార్టీకి చెందిన కొందరు యువకులు ఆహారం అందించారు. రైతుల బాగు కోసం, చెట్ల పరిరక్షణ కోసం , గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి జీవన విధానం పై స్టడీ కోసం ఈ సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు యాత్రికులు తెలిపారు.

డైరెక్టర్ల నియామకం



శాంతికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సావిత్రిబాయి పూలే మహిళా కేంద్రం, సైకలాజికల్ కౌన్సెలింగ్ డైరెక్టర్లుగా తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమ్మడి శాంతి, విద్యా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జేఎల్ సంధ్యారాణిలను శుక్రవారం నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను వైస్ చాన్స్‌లర్ కేఎల్ రజిని వీరికి అందదజేశారు. మహిళా అధ్యయన కేంద్రం ద్వారా విద్యార్థినులను విద్యలో ప్రోత్సహిస్తారు. సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్‌లో విద్యార్థులకు మానసిక, విద్యా సంబంధిత ఒత్తిడిపై కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

కృష్ణవేణి నేత్రాలు సజీవం



నేత్ర దాత కృష్ణవేణి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగ బావాజీ తోటలో నివాసం ఉంటున్న పెదపెంకి కృష్ణవేణి(81) అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందారు. మరణాంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు పి.నాగేశ్వరరావు, రవీంద్రకుమార్, పి.శ్రీరామ్‌కుమార్‌లు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు బి.జగదీష్‌లు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

28న జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ జట్ల ఎంపిక



జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పన్న

పాతపట్నం: శ్రీకాకుళం సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 28వ తేదీ ఆదివారం పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో ఉదయం 9 గంటల నుంచి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు, సెక్రటరీలు గురాడ అప్పన్న, జి.షణ్ముఖరావు శుక్రవారం తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్‌లో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు నెల 4, 5వ తేదీల్లో విజయవాడ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం దగ్గర ఉన్న టెన్నిస్ కోర్టులో రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని, 2006వ సంవత్సరం తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704948062 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బంగారు భవితకు నవోదయం



స్మార్ట్ బోధన.. ఆన్‌లైన్ పాఠాల్లో నిమగ్నమైన విద్యార్థులు

- 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులకు అవకాశం
- దరఖాస్తు చేసేందుకు సెప్టెంబర్ 16 వరకు చాన్స్
- వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష
- ప్రణాళికతో సిద్ధమైతే సీటు గ్యారెంటీ



విభిన్న రంగాల్లో రాణించేలా..

శ్రీకాకుళం న్యూకాలనీ: జవహర్ నవోదయలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. గ్రామీణ విద్యార్థులకు ఈ విద్యాలయాల్లో చోటు లభిస్తే బంగారు భవితకు దారి దొరికినట్టే. ఇక్కడ 6 నుంచి 12 వ తరగతి వరకు సీబీఎస్‌ఈ విద్యతో పాటు హాస్టల్ వసతి సౌకర్యం కల్పిస్తారు. జిల్లాకు సంబంధించి సరుబుజ్జిలి మండల పరిధిలోని వెన్నెలవలసలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

2025–26 ఏడాదికి సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. http:navodaya.gov.in, http://cbreitmr.rci. gov.in/nvr వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తులను మాత్రమే అనుమతిస్తారు. దీనికి ఆఫ్‌లైన్ విధానం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు విధించారు. వచ్చే ఏడాది అంటే 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రాతిపదికగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

5వ తరగతి చదువుతున్నవారు అర్హులు..

జేఎన్‌వీల్లో 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా, 75 సీట్లు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి కేటాయిస్తారు. ఐదు సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇస్తారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం, విభిన్న ప్రతిభావంతుల(దివ్యాంగులు)కు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వరుసగా 3, 4 తరగతి చదివి, ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అలాగే విద్యార్థులు 2020–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చదువుతూ 2013 మే ఒకటి నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.

వసతులు, సౌకర్యాల కల్పన భేష్

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో అన్ని వసతులు, సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. ఉత్తమ బోధన అందిస్తున్నారు. విద్యాలయంలో తరగతులకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక క్వార్టర్స్‌ను నిర్మించారు. విద్యాలయం ఆవరణలో క్రీడల కోసం ప్రత్యేకంగా మైదానాన్ని తీర్చిదిద్దారు. ఆటపాటలు, యోగా వంటివి నిర్వహిస్తుంటారు. విద్యార్థుల కోసం వ్యాయామ శాలలు ఉన్నాయి. స్మార్ట్ తరగతులు కొనసాగిస్తున్నారు. సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి సౌకర్యాలు ఉన్నాయి.

ప్రణాళికాబద్ధంగా చదవాలి..

6వ తరగతిలో 80 సీట్లను నింపుతారు. ఇందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. కేంద్ర జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించింది. 6వ తరగతి మొదలుకుని 12వ తరగతి వరకు తరగతులు కొనసాగిస్తారు. ఏడు ప్రాంతీయ భాషల్లో, మాతృభాషల్లో బోధన జరుగుతుంది. ముఖ్యంగా మాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలను ఆంగ్లంలో, సామాజిక శాస్త్రాలు హిందీలో బోధిస్తారు. పదోతరగతి వరకు సెంట్రల్‌బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)ను అమలు చేస్తారు. సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదివితే సీటు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. మాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై 5వ తరగతి వరకు పాఠాలపై పూర్తిగా అవగాహన పెంచుకుని, పూర్వపు జేఎన్‌వీ పరీక్ష పేపర్లను, పాత మోడల్ పేపర్లను పూర్తిగా సన్నద్ధం చేయగలిగితే మంచి మార్కుల సాధనకు అవకాశం ఉంటుందని నిష్ణాతులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేఎన్‌వీలు వరమనే చెప్పాలి. గొప్ప అవకాశంగా భావించి, సద్వినియోగం చేసుకోవాలి. సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. జాప్యం చేయకుండా వెంటనే దరఖాస్తులు చేసుకోవాలి. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా సీటు పొందవచ్చు.

– దాసరి పరశురామయ్య, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, వెన్నెలవలస, సరుబుజ్జిలి మండలం

● హరివిల్లునెత్తి..



మబ్బు పట్టిన ఆకాశంలో హరివిల్లు అందంగా విరబూసింది. ఎచ్చెర్ల సమీపంలో శుక్రవారం ఇలా ఇంద్ర ధనుస్సు కనిపించింది.

– ఎచ్చెర్ల క్యాంపస్

పరిశ్రమలతోనే ప్రగతి: కలెక్టర్



పరిశ్రమల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పారిశ్రామికంగా ఎదగాలని, అందుకు అధికారులతో బ్యాంకర్లు, పరిశ్రమల శాఖ ఇతర సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖపై సంబంధిత అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో ఎంఎస్‌ఎంఈ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల గురించి ఏడీ రమణారావు వివరించారు. జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏపీఐఐసీ ద్వారా ఇచ్చే భూ వివరాలపై ఆరా తీశారు. ఎంఎస్‌ఎంఈ ద్వారా ఏర్పాటు చేసిన పరిశ్రమల గురించి వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు గురించి ప్రశ్నించగా.. మందస ప్రాంతంలో జీడి ఫ్యాక్టరీ ఉన్నట్లు చెప్పారు. ఏపీఐఐసీ జీఎం పాండు రంగారావు ఏపీఐఐసీ ద్వారా ఏర్పాటు చేసిన పరిశ్రమలపై వివరించారు. డీఐపీసీలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల గురించి ప్రశ్నించగా 41 పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి 7138 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జె.ఉమామహేశ్వరరావు, ఏడీలు రమణారావు, రఘునాథ్, ఎల్‌డీఎం సూర్యకిరణ్, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డీజెడ్‌ఎం పాండు రంగారావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణలో ప్రతిభ చాటిన రూహాన్



ప్రేరణకు ఎంపికైన రూహాన్ సాయిని అభినందిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

రణస్థలం: భారత ప్రభుత్వ విద్యా శాఖ తలపెట్టిన ప్రేరణ ప్రోగాంలో రణస్థలంకు చెందిన ఎల్.రూహాన్ సాయి ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైందని ఎంఈఓ ఎ.త్రినాథరావు తెలిపారు. మండలంలోని ఐరిస్ పాఠశాలలో చదువుతున్న రూహాన్ సాయిని ఎంఈఓ త్రినాథరావు, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించిన ఈ ప్రేరణ కార్యక్రమంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి రూహాన్ సాయి ఎంపికైనట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా పది మంది బాలికలు, పది మంది బాలురు మాత్రమే ఎంపికయ్యారని, వీరికి సెప్టెంబర్ 1 నుంచి వారం రోజులు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జరిగే ప్రేరణ కార్యక్రమానికి ఆహ్వానం అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐరిస్ కరస్పాండెంట్ కె.హరిక్రిష్ణ, ప్రిన్స్‌పాల్ స్వాతిపద్మజ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ భవనం నుంచి జారిపడిన విద్యార్థిని

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బైపీసీ ఫస్టియర్ చదువుతున్న బడ్డాపు పూజ గురువారం రాత్రి విద్యాలయం భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడింది. టెక్కలి మండలం పరశురాంపురం గ్రామానికి చెందిన పూజ కేజీబీవీలో రాత్రి భోజనం చేశాక.. మేడపైన ఆరబెట్టిన దుస్తులు తెచ్చుకునేందుకు వెళ్లింది. అయితే అక్కడ కళ్లు తిరగడంతో ఒక్కసారిగా భవనం మీద నుంచి కింద పడినట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి తెలిపారు. అపస్మారక స్థితికి వెళ్లిపోయిన విద్యార్థినిని వెంటనే కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో ఎక్స్‌రే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అనంతరం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కుడికాలు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు తెలిపారు. పూజ 20 రోజుల కిందటే కేజీబీవీలో చేరిందని, అయితే ఆ తర్వాతి రోజే అనారోగ్యం కారణంతో ఇంటికి వెళ్లిపోయిందని, మళ్లీ గురువారం మధ్యాహ్నం కాలేజీకి వచ్చిందని, అదే రోజు రాత్రి ప్రమాదం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. సమగ్ర శిక్షా ఏపీసీ రోణంకి జయప్రకాష్ ఆస్పత్రికి వెళ్లి పూజను పరామర్శించారు. పూజకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

కార్గిల్ అమర సైనికులకు నివాళి



మాజీ సైనికుడిని సత్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, పక్కనే సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతదేశంలో పుట్టడం మనకు గర్వకారణమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని స్థానిక జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ సిల్వర్ జూబ్లీ వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కార్గిల్ యుద్ధంలో గాయపడిన ఇద్దరు మాజీ సైనికులు టొంప నీలాచలం, చిన్న సింహాచలంలను సన్మానం చేసి, నగదు పురస్కారాలు అందించారు. జిల్లాలో గల మాజీ సైనికులు, వారి కుటుంబాల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఇతర మాజీ సైనికులను సన్మానించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ మాట్లాడుతూ కార్గిల్ వీరుల సేవలను సత్కరించడం మన కర్తవ్యమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం, చైర్మన్ పి.ఈశ్వరరావు, తమ్మినేని కృష్ణారావు, బి.సంజీవరావు, వి.సూర్యనారాయణ, మురళీధరరావు, రామకృష్ణ, సింహాచలం, జనార్దన, రాజశేఖర్, రామారావు, వెంకటరమణ, శ్రీనివాస్ ఇండియన్ ఆర్మీ కాలింగ్ డైరెక్టర్ బీవీ రమణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ ఇండియా



ఒలింపిక్ క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న స్థానిక క్రికెట్ సబ్‌సెంటర్ విద్యార్థులు

నరసన్నపేట: పారిస్‌లో నిర్వహిస్తున్న ఒలింపిక్స్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొంటున్న క్రీడాకారులకు స్థానిక క్రికెట్ సబ్‌సెంటర్ విద్యార్థులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ పోటీల్లో దేశం సత్తా చాటాలని అధికంగా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక క్రికెట్ సబ్ సెంటర్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండా పట్టుకొని క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

పలాస జీడి పరిశ్రమలో తనిఖీలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జీడి పరిశ్రమను జీఎస్టీ అధికారులు శుక్రవారం తనిఖీ చేయడంతో వ్యాపారులు పరుగులు పెట్టారు. పలాస పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఎక్సలెంట్ క్యాజు సప్లయర్స్ పరిశ్రమ తనిఖీ కోసం గురువారం విజయనగరం నుంచి జీఎస్టీ అధికారులు వచ్చారు. ఆ సమయంలో నిర్వాహకురాలు సిందిరి శిరీష అందుబాటులో లేకపోవడంతో ఆ పరిశ్రమకు సీలు వేశారు. అక్కడితో ఆగకుండా యజమాని ఇంటి వద్దకు వెళ్లారు. కానీ ఇంటి వారు తలుపులు తీయలేదు. దీంతో జీఎస్టీ వెస్ట్ సర్కిల్ విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ కింజరాపు వెంకటరమణ, జీఎస్టీఓ ఎం.రమేష్, డీసీటీఓ పలాస శ్వేతలు రెండు బృందాలుగా మరోసారి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. యజమాని శిరీష అందుబాటులో లేకపోవడంతో ఆమె భర్త సిందిరి శ్రీనివాసరావు హాజరయ్యారు. దీంతో సీలు తెరిచి లోపల నిల్వలు, రికార్డులు పరిశీలించారు.

కక్ష కట్టారు..

దీనిపై శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ వ్యాపారంలో అన్ని టాక్సులు కడుతున్నామని, అయినా తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటర్న్స్ రూ.13లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని తెలిపారు. అప్పట్లో పలాస సీటీఓ ఈ డబ్బు కావాలంటే రూ.4 లక్షలు లంచం ఇవ్వాలని అడిగారని ఆరోపించారు. దీంతో తాను జనవరిలో ఏసీబీని ఆశ్రయించానని, అప్పట్లో సీటీఓ కార్యాలయంలో వెంకట్ అనే అధికారిని పట్టుకున్నారని గుర్తు చేశారు. దీంతో జీఎస్టీ అధికారులు కక్ష గట్టి తన పరిశ్రమపై దాడులు చేశారని ఆరోపించారు. ఎలాంటి నోటీసులు లేకుండా సీలు వేశారని, 500కుపైగా పరిశ్రమలు ఉంటే తన వద్దకే వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తమలాంటి వారిని ప్రోత్సహించాలే తప్ప ఇలా వేధించకూడదని విజ్ఞప్తి చేశారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వర దేవాలయం హుండీ ఆదాయం లెక్కింపు వాయిదా పడిందని ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న దేవాలయ ఆవరణలో దేవదాయ శాఖ సిబ్బంది, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించనున్నామని ఈఓ తెలిపారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

వ్యవసాయంపై నిర్లక్ష్యం తగదు

పలాస: ప్రజలకు అన్నం పెట్టే వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. పలాస సూదికొండలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ కేంద్రంగా రైతులు ఎన్నో ఉద్యమాలు చేశారని, అయినా వారి మొర ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు తగిన కేటాయింపుల్లేవన్నారు. ఎరువులు, పురుగు మందుల సబ్సిడీని ఎత్తేశారని, ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చుతున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. సమావేశంలో మాధవరావుతో పాటు వి.పాపయ్య, ఎం.మాధవరావు ఉన్నారు.

పలాసపురంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పశువుల శాల

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంతో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన సంకరామారావు, బడ్డి బైరాగికి చెందిన రెండు రేకు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో పాటు రెండు పశువుల శాలలు పూర్తిగా కాలిపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సోంపేట అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

వరుస దొంగతనాలతో ఆందోళన

కంచిలి: మండల కేంద్రంతోపాటు, మండల వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. తాజాగా గురువారం కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ ప్రకాష్ ఇంటి ముందు పార్క్ చేసిన బజాజ్ పల్సర్ ఎన్.ఎస్. 200 బైక్ చోరీకి గురైంది. దీనిపై బాధితుడు ప్రకాష్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరోవైపు కుంబరినౌగాం పంచాయతీ కేంద్రంలో వారం రోజుల కిందట బెహరా దేవకి, రామచంద్ర బెహరాలకు చెందిన రెండు ఇళ్లలో చోరీ జరిగి సుమారు రూ.50వేలు వరకు నష్టం వాటిల్లింది. అదేవిధంగా ప్రతి ఆదివారం మకరాంపురం గ్రామ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన జరుగుతున్న సంతలో మొబైల్ ఫోన్లు పెద్ద ఎత్తున చోరీకి గురవుతున్నాయి. ప్రతి వారం ఇక్కడ నుంచి ఈ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక్కడ బైక్‌లు దొంగతనం చేసి, వెంటనే సరిహద్దు ఒడిశా ప్రాంతంలోకి వేగంగా పారిపోవడం, అక్కడ విడిభాగాలు చేసి వాటిని అమ్మేయడం పరిపాటిగా మారింది. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు ఈ దొంగతనాలపై గట్టి నిఘా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన చిన్ని వెంకటేశ్వరరావు(28) శుక్రవారం లారీ ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర రావు కాపుతెంబూరు కూడలి నుంచి జాతీయ రహదారిపై టెక్కలి వైపు పెట్రోల్ బంకుకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న లారీ బలంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రమాదం గుర్తించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది తమ వాహనంలో క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుని భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ ఢిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



త్రినాథరావు(ఫైల్)

జలుమూరు: పాగోడు పంచాయతీ పరిధి వెలుసోద గ్రామానికి చెందిన గురువు త్రినాథరావు (61)పాముకాటుతో గురువారం సాయంత్రం మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావిపాడు పంచాయతీ ఏనేటి కొత్తూరులో మధ్యాహ్నం పొలం పనికి వెళ్లిన త్రినాథరావు గడ్డి దుబ్బు తీస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందాడు. త్రినాథరావుకు భార్య అప్పమ్మ, కొడుకు భార్గవరావు, కూతురు కల్యాణి ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో వాన నీటితో ఇక్కట్లు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ చినుకుపడితే చిత్తడిగా తయారవుతోంది. ప్లాట్‌ఫాం పైకప్పులు లేకపోవడంతో వర్షం పడితే ప్లాట్‌ఫాంపై నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుతం స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎక్కడికక్కడే గోతులు తవ్వి ఉంచారు. పనులు నత్తనడకగా సాగడంతో ప్రయాణికులు రైళ్లు ఎక్కేందుకు, దిగేందుకు నానా అవస్థలు పడుతున్నారు.



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో వర్షపు నీటిలో వేచి ఉన్న ప్రయాణికులు